సంపుటి : 18
సంచిక : 93
Vol : 18
Issue : 93

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, గురువారం 4 జూన్ 2026
Karimnagar, Thursday 4 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859



## తెలంగాణకు వర్షసూచన

### 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు.

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం (మిగతా 2లో...)

## రంగం ఏదైనా తగ్గేదేలే..



సరికొత్త సాంకేతిక విప్లవానికి వేదికగా హైదరాబాద్

- ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా మారుతున్న రాజధాని
- ముంబై తర్వాత దేశంలోనే రెండో స్థానం
- నైట్ ఫ్రాంక్ నివేదికలో ఆసక్తికర అంశాలు
- ఇటు ఐటీ... అటు ఏఐలో భాగ్యనగరం సత్తా

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** హైదరాబాద్ నగరం కేవలం ఐటీ, ఐటీఈఎస్ సేవలకే పరిమితం కాకుండా హైపర్‌స్కేల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా వేగంగా ఎదుగుతోంది. ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం.. 2022లో 60.9 మెగావాట్లుగా ఉన్న నగర లైవ్ ఐటీ సామర్థ్యం.. 2025 చివరి నాటికి 151.4 మెగావాట్లకు పెరిగింది. అంతేకాకుండా.. రాబోయే 10 ఏళ్లలో 1.9 గిగావాట్ల డేటా సెంటర్ అభివృద్ధి లైన్‌తో దేశంలోనే ముంబై తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది.

గ్లోబల్ ఐటీ రంగంలో తనదైన ముద్ర వేసిన హైదరాబాద్ నగరం.. ఇప్పుడు సరికొత్త సాంకేతిక విప్లవానికి వేదికగా మారుతోంది. సాధారణ ఐటీ సేవల దశ నుంచి ఒక అడుగు ముందుకేసి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ల హబ్‌గా అవతరిస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెంట్ 'నైట్ ఫ్రాంక్ ఇండియా' విడుదల చేసిన ఇండియా డేటా సెంటర్ మార్కెట్ అప్‌డేట్ 2025 నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. గత మూడేళ్ల కాలంలోనే హైదరాబాద్ తన లైవ్ ఐటీ సామర్థ్యాన్ని రెట్టింపు కంటే ఎక్కువ స్థాయికి పెంచుకోవడం విశేషం. నివేదిక వివరాల ప్రకారం.. 2022 సంవత్సరంలో కేవలం 60.9 మెగావాట్లుగా ఉన్న హైదరాబాద్ లైవ్ ఐటీ సామర్థ్యం.. 2025 చివరి నాటికి ఏకంగా 151.4 మెగావాట్లకు చేరుకుంది. రాబోయే పదేళ్ల కాలంలో హైదరాబాద్‌లో దాదాపు 1.9 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన డేటా సెంటర్ల

(మిగతా 2లో...)

## ఏపీకి కేంద్రం వరాలు

ఏకంగా 6 వేల బస్సులు

ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం క్రింద...

జులైలో అందుబాటులోకి వచ్చే చాన్స్




పీపుల్స్‌డైరీ–అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం తీపికబురు చెప్పింది. పర్యావరణహిత ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు, పాత ఆర్టీసీ బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర సహకారంతో ఏపీ ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా మొత్తం 5,500 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు , అలాగే మరో 500 సీఎన్‌జీ బస్సులను తీసుకురావడానికి కసరత్తు ప్రారంభమైంది.

ఆర్టీసీలో కాలం చెల్లిన సిటీ బస్సులు, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల స్థానంలో ఈ సరికొత్త పర్యావరణ అనుకూల బస్సులు రాబోతున్నాయి.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి ఈ–బస్ సేవ' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 750

(మిగతా 2లో...)



## తనువులు బుగ్గిపాలు

### 21 మంది సజీవదహనం

- ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం..
- 40 మందిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది
- కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్న కొందరు

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మాలవీయ నగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో మంటలు చెలరేగి 21 మంది సజీవ దహనమయ్యారు. బాధితుల్లో ఎక్కువ మంది విదేశీయులే ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం నుంచి మరో 40 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. లోపల ఇంకొందరు చిక్కుకున్నట్టు సమాచారం. ప్రమాదం నుంచి కాపాడుకొనేందుకు పైఅంతస్తుల్లో ఉన్నవారు కిటికీలు, బాల్కనీల నుంచి కిందకు దూకారు.

హౌజ్‌రానీలోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 8.50 గంటల సమయంలో బేస్‌మెంట్‌లో తొలుత మంటలు చెలరేగి పైఅంతస్తులకు వ్యాపించాయి. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపుచేస్తూ.. లోపలి చిక్కుకున్నవారిని (మిగతా 2లో...)

## శివకుమార్ అను నేను...



- కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే ప్రమాణస్వీకారం..
- మంత్రులుగా మరో 13 మంది
- హాజరైన పలు రాష్ట్రాల సీఎంలు, ప్రముఖులు
- డీకే ముందున్న సవాళ్లు ఇవే...

పీపుల్స్‌డైరీ–పొలిటికల్ బ్యూరో : కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌తో గవర్నర్ థావర్ చంద్ గహ్లోట్ ప్రమాణ స్వీకారం చేయించారు. బుధవారం సాయంత్రం బెంగళూరులోని లోక్‌భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. డీకే ప్రమాణస్వీకార వేడుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, కేరళ, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, రేవంత్ రెడ్డి, సుఖ్విందర్ సింగ్ సుఖు తదితరులు హాజరయ్యారు. రాజ్యాంగాన్ని చేతితో పట్టుకుని డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు ఆయన సాష్టాంగ నమస్కారం చేయడం విశేషం.

(మిగతా 2లో...)

## సరీసృపాల స్వర్గధామం భారత్..



- దేశంలో 300కు పైగా పాము జాతులు
- కేరళలో అత్యధికంగా సర్పాలు రెండు, మూడు స్థానాల్లో కర్ణాటక, మహారాష్ట్ర
- జీవ వైవిధ్య పరిశోధనల్లో వెల్లడైన పలు అంశాలు
- ప్రకృతిలో పాముల పాత్ర కీలకం...

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : పాముల జీవవైవిధ్యానికి ప్రపంచ వ్యాప్తంగా మన దేశానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. మన దేశంలో 300కుపైగా పాము జాతులు మనుగడలో ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. కింగ్ కోబ్రా, ఇండియన్ కోబ్రా, రస్సెల్స్ వైపర్, క్రైట్ వంటి విష పూరిత పాములతో పాటు అనేక అరుదైన జాతులు భారత అడవుల్లో కనిపిస్తాయి. అధికారికంగా ఏ రాష్ట్రంలో ఎక్కువ పాములు ఉన్నాయనే జాబితా లేకపోయినా, జీవవైవిధ్య పరిశోధనల్లో కొన్ని రాష్ట్రాలు పాములకు ప్రధాన నిలయాలుగా గుర్తించారు. వర్షాకాలంలో ఆ రాష్ట్రాల సందర్శనకు వెళ్లే పర్యావరణ ప్రియులు, పర్యాటకులు ఈ పాముల బారినపడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి..

కేరళ: పాములు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో నిలుస్తుంది. అందుకే కేరళను భారత దేశపు స్నేక్ డైవర్సిటీ క్యాపిటల్ అని కూడా అంటారు. పశ్చిమ కనుమల ప్రభావంతో కేరళలో అత్యధిక పాము జాతులు కనిపిస్తాయి. కింగ్ కోబ్రా, మలబార్ పిట్ వైపర్ వంటి అరుదైన జాతులు ఇక్కడ ఎక్కువగా ఉంటాయి. వయనాడ్, తేక్కడ, పెరియార్ ప్రాంతాల్లో పాముల జీవవైవిధ్యం ఎక్కువ కావడంతో అక్కడ ట్రెక్కింగ్‌కు వెళ్లే పర్యాటకులు జూన్ - సెప్టెంబర్ మధ్యకాలంలో వర్షాల

(మిగతా 2లో...)

# సరీసృపాల స్వర్గధామం భారత్

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా జాగ్రత్తగా ఉండాలి.

**కర్ణాటక:** కర్ణాటకకు భారత దేశపు కోబ్రా క్యాపిటల్‌గా గుర్తింపు ఉంది. అక్కడి పశ్చిమ కనుమలు పాములకు బలమైన నిలయంగా నిలుస్తోంది. ముఖ్యంగా అగుంబే ప్రాంతంలో కింగ్ కోబ్రాల సంఖ్య గణనీయంగా ఉన్నాయి. కింగ్ కోబ్రాతో పాటు వైన్ స్నేక్స్, పిట్ వైపర్స్, కోరల్ స్నేక్స్, జెర్రిపోతు (రాట్ స్నేక్) వంటి జాతులు ఇక్కడ కనిపిస్తాయి.

**మహారాష్ట్ర:** ఈ రాష్ట్రంలోని పశ్చిమ కనుమలు, కొంకణ్ తీరం, దక్కన్ అడవుల్లో పాముల జీవవైవిధ్యం ఎక్కువగా ఉంటుంది. అంబోలి, తడోబా, సహ్యాద్రి పరిసర అటవీ ప్రాంతాలు పాములకు నిలయాలు. ఈ ప్రాంతంలో వర్షాకాలంలో ట్రెక్కింగ్‌కు వెళ్లే పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలి.

**పశ్చిమ బెంగాల్:** ఈ రాష్ట్రంలోని సుందర్బన్స్ మడ అడవులు పాముల వైవిధ్యానికి నిలయం. నాగుపాములు, కట్లపాములు, రక్తపింజరులు (రస్సెల్స్ వైపర్) తదితర పాములు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తాయి. మడ అడవుల సందర్శనకు వెళ్లే పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలి.




**అస్సాం:** ఈశాన్య రాష్ట్రాల్లోని అస్సాం విభిన్న రకాల పాములకు స్వర్గధామంగా విరాజిల్లుతోంది. కాజీరంగా, బ్రహ్మపుత్ర వరద మైదానాలు అనేక పాము జాతులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి.

అలాగే తమిళనాడు, మేఘాలయ, ఒడిశా రాష్ట్రాలు కూడా సరీసృపాల జీవవైవిధ్యంలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. నీలగిరి కొండలు, వర్షారణ్యాలు, చిత్తడి నేలలు పాముల పెరుగుదలకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని హిమాలయ అడవులు, ఉత్తరప్రదేశ్‌లోని నదీ పరివాహక ప్రాంతాలు కూడా పాముల సంఖ్య అధికంగా ఉండే ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి.

**ప్రత్యేక జాగ్రత్తలు మస్ట్..**

వన్యప్రాణి పర్యాటకులు ఈ ప్రాంతాలను సందర్శించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. అడవుల్లో ట్రెక్కింగ్ చేసే సమయంలో పూర్తిగా కాళ్లను కప్పే పాదరక్షలు ధరించాలి. రాత్రి వేళల్లో ఒంటరిగా సంచరించకపోవడం మంచిది. అలాగే స్థానిక గైడ్‌ల సూచనలు పాటించాలి. పాములను దగ్గరగా వెళ్లి ఫోటోలు తీయడానికి ప్రయత్నించకూడదు.

ప్రకృతిలో పాములు కీలక పాత్ర పోషిస్తాయి. ఎలుకలు, కీటకాలను నియంత్రించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయి. అందువల్ల వాటిని భయపడి చింపేయకుండా.. గౌరవంతో చూసి వాటి సహజ ఆవాసాలను పరిరక్షించడం మనందరి బాధ్యత.

# తనువులు బుగ్గిపాలు..

(మొదటి పేజీ తరువాయి)

రక్షించేందుకు ప్రయత్నించారు. గాయపడినవారిని చికిత్ సకోసం సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రత్యక్ష సాక్షి ఒకరు మాట్లాడుతూ.. ముందుగా చిన్నగా మొదలైన మంటలు వేగంగా పైకి వ్యాపించాయని, దీంతో లోపల చిక్కుకున్నవారు బయటకు వచ్చే మార్గం లేకుండా పోయిందన్నారు.

కిటికీల నుంచి పలువురు కిందికి దూకారని, వారికి ఎలాంటి దెబ్బలు తగలకుండా స్థానికులు పరుపులను కిందవేశారని చెప్పారు. ఒక మహిళ చిన్నారితో సహా మూడో అంతస్తు నుంచి కిందికి దూకిందని వివరించారు. ఉదయం ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించిన సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, వెంటనే మిగతా సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఆ రెస్టారెంట్ చెఫ్ కేసర్ సింగ్ తెలిపారు. బయటకు వచ్చిచూసేసరికి భవనం మొత్తం మంటల్లో చిక్కుకుందని పేర్కొన్నాడు. ఈ హోటల్‌లో బసచేసినవారిలో ఎక్కువ మంది సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం వచ్చినవారేనని అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగే సమయానికి బాధితులు నిద్రలో ఉండటం వల్ల ప్రాణనష్టం అధికంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రాణాలు కాపాడుకోడానికి పలువురు భవనంపై నుంచి దూకుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇదిలా ఉండగా ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయనేది ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. ఫ్లోరిష్ స్టేకు ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ కాన్సెప్ట్ కింద లైసెన్స్ మంజూరు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, కేవలం ఆరు గదులకు మాత్రమే అనుమతి ఉంది. కానీ, బేస్‌మెంట్‌లోని గదులు సహా ఆ హోటల్ 25 గదులను నిర్వహిస్తున్నట్లు సమాచారం. హోటల్ అగ్నిమాపక శాఖ నుంచి సేఫ్టీ సర్టిఫికెట్ పొందిందా లేదా అనేది అధికారులు ధ్రువీకరించనున్నారు. అంతేకాకుండా, ఆ హోటల్‌కు ఎంట్రీ, ఎగ్జిట్‌కు ఒకటే మార్గం ఉందని, దీనివల్ల ప్రమాద తీవ్రత ఎక్కువైందని అన్నారు.



# ఏపీకి కేంద్రం వరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి. వీటిలో తొలి విడతగా 300 బస్సులు ఈ ఏడాది జులై నెలలోనే రోడ్డెక్కడానికి సిద్ధంగా ఉన్నాయి.

మిగిలిన 450 బస్సులు ఆగస్టు నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ బస్సులను రాష్ట్రంలోని ముఖ్యమైన 11 నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, అమరావతి, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, కడప మరియు అనంతపురంలో నడపనున్నారు. తిరుమల ఘాట్ రోడ్డులో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 300 ప్రత్యేక ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ వేగంగా జరుగుతోంది.




ఇవే కాకుండా, గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ విధానంలో ఆర్టీసీ సొంతంగా మరో 1,450విద్యుత్ బస్సులను సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇవి 2027 మార్చి నాటికి అందుబాటులోకి రానున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద వెయ్యి బస్సులు, 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద మరో 2,000బస్సుల కోసం ప్రతిపాదనలను కేంద్రానికి పంపారు.ఎలెక్ట్రిక్ బస్సులతో పాటు సీఎన్‌జీ ఇంధనం అందుబాటులో ఉన్న నగరాల్లో నడిపేందుకు 500సీఎన్‌జీ బస్సులను కూడా కొనుగోలు చేయనున్నారు.

కొత్తగా వచ్చే ఈ బస్సుల రంగుల్లో ఎలాంటి మార్పులు ఉండవని, ప్రయాణికులు గందరగోళానికి గురికాకుండా పాత రంగులనే కొనసాగిస్తారని అధికారులు స్పష్టం చేశారు. ఏపీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం, దివ్యాంగుల కోసం తీసుకొచ్చిన 'దివ్యాంగ శక్తి' పథకాల వల్ల బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో రాబోయే 6,000 కొత్త బస్సులు ప్రజారవాణా ఇబ్బందులను పూర్తిగా దూరం చేయనున్నాయి.

# శివకుమార్ అను నేను...

(మొదటి పేజీ తరువాయి)

ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రిగా జి.పరమేశ్వర ప్రమాణస్వీకారం చేశారు. మంత్రులుగా సిద్ధరామయ్య తనయుడు యత్రీంద్ర, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే,కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, సతీశ్ జర్కిహోళి, రామలింగారెడ్డి, కృష్ణబైరె గౌడ, మాజీ స్పీకర్ యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు.

సాధారణంగా సీఎం ప్రమాణ స్వీకార వేదిక ద్వారాలు, కార్యాలయంలోని ఆసనాలన్నీ జ్యోతిశాస్త్ర ప్రకారమే మార్చడ విశేషం. ఏఐసీసీ నుంచి విశిష్ట అతిథులు, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ప్రత్యేక అతిథులుగా.. పలు రంగాల ప్రముఖులను గౌరవ అతిథులుగా ఆహ్వానించారు. మొత్తం 1100 మందికి లోక్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి 3 వేల మంది పోలీసులతో భద్రత కల్పించారు.



**డి .కె. శివకుమార్ ముందున్న సవాళ్లు**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డి.కె. శివకుమార్ ముందు పలు కీలక సవాళ్లు ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఐదు గ్యారంటీ పథకాలను నిరంతరాయంగా ప్రజలకు అందించడం మరియు రాష్ట్ర బడ్జెట్‌ను సమతుల్యం చేయడం. కొత్త మంత్రివర్గంలో సామాజిక సమీకరణాలు దెబ్బతినకుండా, సిద్ధరామయ్య వర్గానికి అలాగే తన మద్దతుదారులకు సమాన ప్రాధాన్యత కల్పించడం. సిలికాన్ వ్యాలీగా పేరుగాంచిన బెంగళూరు నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టడం లాంటివి ఉన్నాయి.

# కారాగారంలో తొమ్మిదేండ్లు

- చివరకు నిర్దోషిగా ఇటీవల కోర్టు తీర్పు
- మహిళ హత్య కేసులో అతడిపై అభియోగాలు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిజామాబాద్‌లో 2017లో జరిగిన హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న రాజస్థాన్‌కు చెందిన వలస కార్మికుడు మంగీలాల్‌కు విధించిన శిక్షను రద్దు చేస్తూ విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. అభియోగాలను సందేహాతీతంగా నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొన్న హైకోర్టు, నిందితుడికి అనుమాన లాభం వర్తిస్తుందని స్పష్టం చేసింది. జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ బీఆర్ మధుసూదన్ రావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ తీర్పును వెలువరించింది. దాదాపు తొమ్మిదేళ్లుగా జైలులో ఉన్న మంగీలాల్ అనే నిందితుడు దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించిన కోర్టు, ట్రయల్ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను రద్దు చేసింది. ఇతర కేసుల్లో అవసరం లేకపోతే వెంటనే విడుదల చేయాలని జైలు అధికారులను ఆదేశించింది.

మంగీలాల్ తన యజమాని వద్ద పనిచేస్తున్న సమయంలో అతని భార్యపై లైంగిక వేధింపులకు ప్రయత్నించాడని కేసు నమోదు అయ్యింది. యజమాని భార్యతో అసభ్యంగా ప్రవర్తించడంతో, ఆమె ప్రతిఘటించి భర్తకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో కోపోద్రిక్తుడై రోకలి బండతో తలపై దాడి చేసి హత్య చేశాడని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఈ ఘటనలో మహిళ తీవ్ర గాయాలతో మృతి చెందడంతో పోలీసులు మంగీలాల్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేరని, మొత్తం కేసు పరిస్థితుల ఆధారిత సాక్ష్యాలపైనే ఆధారపడిందని హైకోర్టు పేర్కొంది.



పరిస్థితుల ఆధారిత సాక్ష్యాలు ఒకదానితో ఒకటి పూర్తిస్థాయిలో అనుసంధానమై, నిందితుడే నేరస్థుడని స్పష్టంగా నిరూపించాల్సి ఉంటుందని కోర్టు గుర్తు చేసింది. రికార్డులను పరిశీలించిన ధర్మాసనం.. నిందితుడిపై ఉన్న అనుమానాలను సందేహాతీతంగా నిరూపించలేకపోయిందని తేల్చింది. ఈ నేపథ్యంలో మంగీలాల్‌కు అనుమాన లాభం కల్పిస్తూ శిక్షను రద్దు చేసి విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. 2017 ఏప్రిల్ 28 నుంచి జైలులో ఉన్న మంగీలాల్‌కు ఈ తీర్పుతో దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత స్వేచ్ఛ లభించినట్లైంది. హత్య కేసుల్లో పరిస్థితుల ఆధారిత సాక్ష్యాల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసేలా ఈ తీర్పు ఉందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# రంగం ఏదైనా తగ్గేదేలే...

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద హైపర్‌స్కేల్ హబ్‌గా ఉన్న ముంబై మొత్తం సామర్థ్యం 3.9 గిగావాట్లు కాగా.. తర్వాతి స్థానంలో హైదరాబాద్ నిలిచి తన సత్తా చాటింది.

హైదరాబాద్ గ్లోబల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌గా ఎదగడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవలు ప్రధాన కారణమని నివేదిక పేర్కొంది. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో పాటు హై-డెన్సిటీ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, భారీ స్థాయి శిక్షణ కంప్యూట్, లిక్విడ్ కూలింగ్ టెక్నాలజీల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక ప్రోత్సాహకాలు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని చెప్పింది.

హైదరాబాద్‌లో డేటా సెంటర్ల డిమాండ్ కూడా క్రమంగా మారుతోందని నివేదికలో వెల్లడైంది. 2024లో నగరం 19.2 మెగావాట్ల డేటా స్పేస్ వినియోగాన్ని నమోదు చేసింది. 2025లో ఈ డిమాండ్ కొంత మేర స్థిరంగా ఉన్నప్పటికీ.. మార్కెట్‌లో ఖాళీల శాతం సగటున 23 శాతంగా నమోదైంది. అంటే రాబోయే రోజుల్లో ఏఐ టెక్నాలజీ ఆధారంగా రానున్న భారీ డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా మార్కెట్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉందని నివేదిక విశ్లేషించింది. ఈ దూకుడు చూస్తుంటే భవిష్యత్తులో గ్లోబల్ ఏఐ మ్యాప్‌లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# తెలంగాణకు వర్ష సూచన..

(మొదటి పేజీ తరువాయి)

ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు.

ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# నిరుపేద పద్మశాలీ యువకుని అత్యుత్తమ ప్రతిభ

- ఎంసెట్ లో 63వ ర్యాంక్
- ఐఐటి ఓపెన్ కేటగిరీలో 900వ ర్యాంక్
- మెయిన్స్ ఓపెన్ కేటగిరిలో 1258వ ర్యాంక్
- నారాయణ విద్యాసంస్థలో విద్యాభ్యాసం
- నిరుపేద విద్యార్థిని ప్రోత్సహించిన యజమాన్యం
- ఉచితంగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్
- శ్రీ వర్ధన్ కు శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘ నేతలు




**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** నిరుపేద పద్మశాలి యువకుని ప్రతిభను గుర్తించారు నారాయణ విద్యాసంస్థలు. యువకుని తెలివితేటలు, చదువుల్లో అసాధారణ ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థలు యువకునికి ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించి ఆణిముత్యంగా తీర్చిదిద్దగా శ్రీ వర్ధన్ కు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా సంఘ నేతలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా కాశిబుగ్గకు చెందిన సాంబారి కల్పన చంద్రమోహన్ ల పెద్ద కుమారుడు సాంబారి శ్రీ వర్ధన్ ది నిరుపేద పద్మశాలి కుటుంబం. తండ్రి చంద్రమోహన్ వరంగల్ లోని ఓ చికెన్ సెంటర్లో గుమస్తాగా పని చేస్తుండగా తల్లి గృహిణి. పదవ తరగతి ఫలితాల్లో 10/10 అత్యధిక మార్కులు సాధించగా శ్రీ వర్ధన్ ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థలు హైదరాబాదులోని అన్నోజిగూడ సింగపూర్ సిటీ బ్రాంచ్ లో రెండేళ్లపాటు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించారు. చదువుల్లో దిట్ట ఆయన శ్రీ వర్ధన్ ఇటీవల వెలువడిన ఐఐటి ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 900 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 154 ర్యాంకు సాధించారు. అలాగే ఎంసెట్ 2026 ఫలితాల్లో 63వ ర్యాంకు, మెయిన్స్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 1258వ ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో 220వ ర్యాంక్ సాధించి ఔరా అనిపించాడు. మొదటి నుండి అన్ని సబ్జెక్టుల్లో టాప్ మార్కులతో దూసుకుపోతున్న శ్రీ వర్ధన్ ఇంటర్ ఫలితాలతో పాటు ప్రముఖ పోటీ పరీక్షల్లో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి రికార్డ్స్ నెలకొల్పాడు. ఆల్ ఇండియా లెవెల్ లో అత్యధిక మార్కులు సాధించిన శ్రీ వర్ధన్ ను నారాయణ విద్యాసంస్థల అన్నోజీగూడ కోర్ డిన్ చెరుకు రఘుపతి రెడ్డి, ఏజీఎంలు పి అరుణ్ కుమార్, అనిల్ గవాస్కర్ లు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా కుమారుని ఇంటర్మీడియట్ విద్యకు నారాయణ విద్యాసంస్థలు ఎంతో ప్రోత్సాహం అందించాయని వారి ప్రోత్సాహంతోనే ఇవాళ శ్రీ వర్ధన్ మూడు విభాగాల్లో టాప్ ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా సంఘం నేతలు శ్రీ వర్ధన్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రతిభను గుర్తించి నిరుపేద పద్మశాలి బిడ్డకు ఉచితంగా చదువులు అందించిన నారాయణ విద్యాసంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# హుజురాబాద్ పోలీసులకు అరుదైన గౌరవం

- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవా పురస్కారాలు
- హుజురాబాద్ డివిజన్‌కు చెందిన ముగ్గురు పోలీసు అధికారులకు సత్కారం

**హుజురాబాద్, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధికి చెందిన ముగ్గురు పోలీసు అధికారులకు సేవా పురస్కారాలు లభించాయి. కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా



ఈ పురస్కారాలను అందజేశారు. సేవా పురస్కారాలు అందుకున్న వారిలో హుజురాబాద్ టౌన్ సీఐ కరుణాకర్, ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సదానందం, హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మధు మల్లయ్య ఉన్నారు. హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధికి చెందిన ముగ్గురు అధికారులు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాలకు ఎంపిక కావడం పట్ల పోలీసు అధికారులు, సహచర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ....తమ సేవలను గుర్తించి సేవా పురస్కారం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందని, ఇదే ఉత్సాహంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ బీభత్సం..రాబోయే 2 రోజులు భారీ వర్షాలు!

**పీపుల్స్ డైరీ డెస్క్:** భారత వాతావరణ శాఖ అందించిన తాజా నివేదికల ప్రకారం, తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో రాబోయే రెండు రోజుల్లో వాతావరణంలో ఊహించని మార్పులు సంభవించనున్నాయి. నైరుతి రుతుపవనాల రాక మరియు స్థానిక వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఉభయ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పీపుల్స్ డైరీ ప్రత్యేక కథనం

## తెలంగాణలో 'ఆరెంజ్ అలర్ట్' హెచ్చరిక

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం వేగంగా మారుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలంటూ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం మరియు రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉన్నందున, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, ముఖ్యంగా రైతులు పొలాల్లో పనుల నిమిత్తం వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాలలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో విచిత్రమైన వాతావరణం

అటు ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం భిన్నమైన పరిస్థితులను ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలోని సుమారు 10 జిల్లాల్లో రాబోయే రెండు రోజుల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తా ఆంధ్రా మరియు రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో బలమైన గాలులతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేస్తున్నారు. అయితే, ఒకవైపు వర్ష సూచన ఉన్నప్పటికీ, దక్షిణ కోస్తాలోని కొన్ని ప్రాంతాలలో ఎండల తీవ్రత ఇంకా తగ్గలేదు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల మరియు కృష్ణా జిల్లాల్లోని కొన్ని మండలాల్లో వడగాల్పులు (ఎమ్ఫ్-ఝుజవం) వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, మధ్యాహ్నం వేళల్లో ప్రజలు అనవసరంగా బయటకు రాకూడదని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

## రైతులు మరియు ప్రజలకు ప్రభుత్వ సూచనలు

ఈ విచిత్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు మరియు విపత్తు నిర్వహణ శాఖలు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాయి. ఇప్పటికే కోత కోసి ఐకేపీ కేంద్రాల్లో ఉంచిన ధాన్యం తడిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం రైతులకు సూచించింది. వర్షం పడే సమయంలో చెట్ల కింద గానీ, విద్యుత్ స్తంభాల పక్కన గానీ నిలబడకూడదని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఎండలు మరియు అకస్మాత్తుగా పడే వర్షాల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, ముఖ్యంగా పిల్లలు మరియు వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రుతుపవనాల కదలికలను బట్టి వాతావరణంలో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. తాజా అప్‌డేట్ల కోసం పీపుల్స్ డైరీని అనుసరిస్తూ ఉండండి.

# పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు...నిబంధనలను ఉల్లంఘిస్తున్న నిర్వాహకులు

- రేగొండ మండలం గంగారావి చెరువు వద్ద ఇటుకల బట్టిలు..
- బట్టీల ఏర్పాటు నుంచి మట్టి తవ్వకాల వరకు అనుమతులు నిల్
- ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో రాయల్టీ ఎగవేత
- ఒడిశా నుంచి తక్కువ వేతనాలకు కూలీలను తెచ్చుకుంటున్న యాజమాన్యాలు
- కార్మిక చట్టాలకు తూట్లు-పట్టించుకోని రెవెన్యూ, గనులు, పర్యావరణ, కార్మిక శాఖల అధికారులు





**రేగొండ జూన్ 03 పీపుల్స్ డైరీ :** ఇటుకల బట్టీల నిర్వాహకులు పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ఇటుకల తయారీ కోసం ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. మరోవైపు ఇటుకల కాల్చే సమయంలో పెద్దఎత్తున పొగ ఎగిసి పడుతున్నది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇటుల బట్టీల నిర్వాహకుల తీరు ఇష్టారాజ్యంగా తయారైంది. ఎండ కాలం కావడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది సిమెంట్ (ఫ్లాజీ) ఇటుకలకుబదులు బట్టీల్లో తయారైన మట్టి ఇటుకల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో ప్రస్తుతం బట్టీల్లో ఇటుకల తయారీ ముమ్మరంగా సాగుతున్నది. వాస్తవంగా ఇటుక బట్టీ ఏర్పాటు చేయాలంటే స్థానిక గ్రామ పంచాయతీ, రెవెన్యూ, గనులు, కార్మిక, పర్యావరణ, భూగర్భ జలవనరుల శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఇటుకల తయారీకి అవసరమైన మట్టి తవ్వకాల కోసం గనుల శాఖ అనుమతి వుండాలి. లక్ష ఇటుకలు తయారు చేస్తే.. స్థానిక గ్రామ పంచాయతీకి, గనుల శాఖకు రూ.10 వేలకు తక్కువ కాకుండా రాయల్టీ చెల్లిం చాలి. కానీ జిల్లాలో అత్యధిక శాతం ఇటుకల బట్టీల నిర్వాహ కులు ఎటువంటి అనుమతులు తీసుకోలేదు.రేగొండ మండలంలో వరుసగా భూపాలపల్లి పరకాల ప్రధాన రహదారి పక్కన ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు.. కానీ ఈ సంఖ్యకు రెట్టింపు వుంటుంది. ఇటుకల తయారీకి అవసరమైన మట్టిని దమ్మన్నపేట, చెన్నపూర్, రూపిరెడ్డి పల్లి గ్రామాల చెరువుల, నుంచిభారీ మొత్తంలో తవ్వుకుపోతున్నారు. వాస్తవంగా మట్టి తవ్వకాల కోసం రెవెన్యూ, గనుల శాఖలతోపాటు అవసరమైతే జలవనరుల శాఖ నుంచి కూడా అనుమతి పొందాలి. క్యూబిక్ మీటరు మట్టికి రూ.42 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. కానీ జిల్లాలో మట్టి తవ్వకాలు జరుపుతున్న ఇటుక బట్టీల నిర్వాహకుల్లో అత్యధికులు రాయల్టీ చెల్లించడం లేదని గనుల శాఖ అధికారుల సమాచారం.బట్టీల నిర్వాహకులని వివరణ కోరగా ఇప్పటి వరకు మట్టికి ఎలాంటి అనుమతి తీసుకోలేదాన్నారు. అనుమతి కోసం అర్జీ పెట్టమని ఆర్డర్ మాత్రం రాలేదన్నారు.. మట్టిని మాత్రం తరలిస్తున్నాం తరువాత పర్మిషన్ తీసుకుంటామని ఊహ జానకంగా సమాధానం చెప్పారు.. మండల తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, కాకుండా ఎవరు పర్మిషన్ ఇచ్చారంటూ అనుమానం వెక్తం అవుతోంది.. వేల సంఖ్యలో ట్రాక్టర్ లతో మట్టిని తరలించి చెరువులను బొందల గడ్డలుగా తయారు చేశారు. బట్టీల కోసం పచ్చని పంటలు పండే ప్రదేశంలో పెట్టడం పట్ల కొంతమంది రైతులు ఆగ్రహం వెక్తం చేస్తున్నారు. అదే కాకుండా నేషనల్ హైవే నిత్యం వేల సంఖ్యలో వాహనాలు, నడుస్తువుంటాయి బట్టీలను కాల్చే సమయం లో పొగ వల్ల వాహన దారులకు ఇబ్బంది ఏర్పడుతుంది. పంట పొలాల కు ఎరువుగా వాడవలసిన శిల్ట్ మట్టిని ఇటుక బట్టీలకు ఎలా ఎవరిని అడిగి తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు ఎం చేస్తున్నారు. ఇటుకబట్టీల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయడంలేదు. స్థానిక కూలీలు అయితే ఎక్కువ కూలి డిమాండ్ చేస్తారన్న ఉద్దేశంతో వెనుకబడిన ప్రాంతమైన ఒడిశా నుంచి కుటుంబాలతో సహా కూలీలను రప్పించుకుంటున్నారు. వీరికి అడ్వాన్సుల రూపంలో కొంత సొమ్మును ముట్టజెప్పి, బట్టీల్లో తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేయించు కుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆందోళన కరమైన విషయం ఏమిటంటే.. బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులు తమ పిల్లలను బడికి పంపకుండా.. ఇటుకల తయారీ పనులు చేయిస్తున్నారు. కార్మిక శాఖ అధికారులు నిష్పక్షపాతంగా తనిఖీలు జరిపితే ఇటువంటి ఉల్లంఘనలు బయటపడతాయి. పీపుల్స్ డైరీ గనుల శాఖ అధికారులను వివరణ కోరగా మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తయారు చేసిన ఇటుకల సంఖ్యనుబట్టి రాయల్టీ చెల్లించాలన్నారు. మండలంలో ఎన్ని ఇటుకల బట్టీలు ఉన్నాయనేది మండలాల నుంచి వివరాలు సేకరిస్తున్నామన్నారు.

# జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తొలి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం



నిజామాబాద్,జూన్,03 (పీపుల్స్ డైరీ) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (GGH)లో తొలి ప్లాస్టిక్ సర్జరీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించబడింది.గాంధారి మండలానికి చెందిన లచ్చవ్వ (45 సంవత్సరాలు) అనే రోగికి ముఖం ఎడమ చెంప భాగంలో (Basal Cell Carcinoma) వ్యాధి నిర్ధారణ కావడంతో, ప్లాస్టిక్ సర్జన్ డా. శివాని ఆధ్వర్యం లో Rotation Flap Reconstruction శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స శస్త్రచికిత్స విభాగాధిపతి డా. విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా ఉండి, కోలుకుంటున్నారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, నిజామాబాద్‌లో నిర్వహించిన మొట్టమొదటి ప్లాస్టిక్ సర్జరీ కేసు కావడం విశేషం. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు మరింత విస్తరిస్తున్నా యని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్య బృందాన్ని అభినందించింది. భవిష్యత్తులో కూడా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందిం చేందుకు ఆసుపత్రి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమం లో డా.



బి.వి. నాగమోహన్ సూపరింటెండెంట్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, నిజామాబాద్ పాల్గొన్నారు.

# బాక్సింగ్ విద్యార్థులకు పోషకాహార పంపిణీ




**హసన్‌పర్తి, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాక్సింగ్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు ప్రతిరోజూ అరటిపండ్లు, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. గత 25 రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోషకాహారం అందజేస్తున్నారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ దీవి అజిత్‌కుమార్ మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడలో శారీరక దృఢత్వం, చురుకుదనం, సహనశక్తి, మానసిక ఏకాగ్రత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాల పెంపుదలకు సరైన పోషకాహారం అవసరమని, అందుకే ప్రతిరోజూ అరటిపండ్లు, కోడిగుడ్లు అందిస్తున్నట్లు తెలిపారు. అరటిపండ్లు తక్షణ శక్తిని అందించడంతో పాటు కండరాల అలసటను తగ్గిస్తాయని, కోడిగుడ్లలోని ప్రోటీన్లు కండరాల పునరుద్ధరణకు దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగడానికి తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ శిక్షకుడు శీలం నరేందర్, క్లబ్ సభ్యులు ఇనుముల కృపాకర్, శ్యాంసుందర్, తోట సంపత్, నల్ల కిరణ్, గోపరాజు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు ఆర్థిక అండగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న



**ఏటూరు నాగారం జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** బాధితులకు ఆర్థిక అండగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న. ఏటూరునాగారం మండలం, రోహీర్ గ్రామంలోని రోడ్డు ప్రమాదంలో గాయపడిన డొంగిరి శివమణి బాధితుడికి, అలాగే కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కొండగొర్ల నర్సింహులు బాధితుడికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అవసర సమయంలో బాధితులకు అండగా నిలిచారు. ఇర్సవడ్ల వెంకన్న సహాయానికి బాధితులు మరియు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తమ వంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, టౌన్ వర్కింగ్ సరికొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఆదాయానికి గండి

## సర్వే నెం. 66 లో అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?-నిబంధనలు బేఖాతరు



**ఆర్మూర్, జూన్, 03(పీపుల్స్ డైరీ) :** ఆర్మూర్ మండలంలోని కొటార్మూర్ గ్రామంలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కొటార్మూర్ లోని సర్వే నో:66/1,66/2,66/3,66/4 లో మున్సిపల్ అనుమతులు లేనటువంటి నిర్మాణాలను తొలగించాలని, మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న ఈ నిర్మాణం పై మున్సిపల్ యక్ట్ (2019) ప్రకారం చర్యలు తీసుకోవాలని,యజమాని ఇట్టేడి చిన్న సాయన్న మరియు కాంట్రాక్టు శ్రీనివాస్ లపై చర్యలు తీసుకోవాలని అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగిస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని ప్రజల అవగాహన కొరకు బోర్డును నిర్మించాలని తెలంగాణ మాదిగ మహాసేనా జిల్లా అధ్యక్షులు గంగాని స్వామి డిమాండ్ చేశారు.

# మాజీ సర్పంచు దొడ్డ కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన బి ఆర్ ఎస్ నాయకులు




**ఏటూరు నాగారం జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని రామన్నగూడెం గ్రామ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు గడదాసు.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రామన్నగూడెం మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ తండ్రి కీర్తిశేషులు దొడ్డ వెంక కటయ్య సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొని వెంకటయ్య చిత్ర పఠానికి పూలు వేసి నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతిని చేకూర్చగలరని భగవంతుడుని వేడుకోవడం జరిగింది. దొడ్డ కృష్ణ, వారి సోదరులు దొడ్డ ఆదినారాయణ, దొడ్డ పుల్లయ్య టుంబసభ్యులను పరమార్శించి బి.ఆర్.ఎస్ పార్టీ మండల కమిటీ పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ మాజీ మండల కమిటీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, మాజీ ఎం.పీ.పీ కోనేరు నగేష్, సయ్యద్ సర్దార్ పాష, అంతటి నాగరాజు, ఎండి. ఖాజాపాష, రామన్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇట్టెం నాగరాజు, పల్లా మాణిక్యం, దడిగల సమ్మయ్య, కర్ర రవీందర్, వావిలాల పోశయ్య, వావిలాల రాంబాబు, కాళ్ళ రామకృష్ణ మరియు రామన్నగూడెం గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఉపకేంద్రం ఆకస్మిక తనిఖీ

**ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్**



**ఆర్మూర్, జూన్ , 03(పీపుల్స్ డైరీ) :** ఆర్మూర్ మండలంలోని చేపూర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను, మందుల నిల్వ రిజిస్టర్ను, ఓపి రిజిస్టర్ను, వ్యాధి నిరోధక టీకాల అర్హుల ముందస్తు జాబితాను తనిఖీ చేశారు. ప్రతి ఒక్క చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు అందే విధంగా చూడాలన్నారు. ఈ నెలలో 28వ తేదీన జరిగే పల్స్ పోలియోకు 0 నుండి 5 సంవత్సరాల పిల్లల జాబితాను తయారు చేసుకుని పెట్టుకోవాలని సూచించారు. సిబ్బందికి సమయపాలన పాటించాలని సూచించారు. వచ్చేది వర్షాకాలం కావున సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, సువర్ణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..**

**భూపాలపల్లి జూన్ 03 పీపుల్స్ డైరీ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 5న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి తో కలిపి ప్లాస్టిక్ వాడకంపై అవగాహనకు గుడ్డ సంచులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర హానిజరుగుతున్నదని భూమి, నీరు కలుషితమవుతూ జీవులు ప్రమాదంలో పడుతున్నాయని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను అనుసరించాలని సూచించారు. పర్యావరణాన్ని రక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, వ్యవసాయ అధికారి బాబురావు, సిపిఓ జవహర్, డీఈఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొమి రెడ్డి రాములు జయంతి



**మెట్ పల్లి జూన్ 3: (పీపుల్స్ డైరీ) :** ప్రజాసేవకు జీవితాన్ని అం కితం చేసిన మాజీ ఎమ్మెల్యే, సుప్రీంకోర్టు న్యాయవా ది స్వర్గీయ కొమిరెడ్డి రాము లు జయంతి ఉత్సవాలను స్థానిక విదిత్ రెడ్డి గార్డెన్, వె ల్లుల్ల రోడ్ లో ఘనంగా ని ర్వహించారు ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన మ హోన్నత నాయకుడు స్వర్గీ య కొమిరెడ్డి రాములు ఆశ యాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించా రు. ఈ కార్యక్రమంలో పట్ట ణ అధ్యక్షుడు మొహమ్మద్ రైసొద్దీన్, పట్టణ మాజీ అ ధ్యక్షుడు కుతుబోద్దీన్ పాషా కౌన్సిలర్లు కాజా అజీమొద్దీ న్, మహమ్మద్ ముఖీం తది తరులు పాల్గొన్నారు

# జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ సాధించిన కరాటే వి ద్యార్థులు

**అభినందించిన ఇబ్రహీం పట్నం ఎస్సై నవీన్ కుమార్**



**మెట్ పల్లి జూన్ 3:(పీపుల్స్ డైరీ) :** జపాన్ కరాటే అసోసియే షన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ ఆధ్వ ర్యంలో కరాటే అసోసియే షన్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ లో నిర్వహిం చిన జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ పరీక్షలో ఉత్తీర్ణత సా ధించిన ఇబ్రహీంపట్నం గ్రా మానికి చెందిన కరాటే వి ద్యార్థులు వి. హరిప్రీత్, ఏ. హృషికేష్ లను శిక్షకులు ప్ర వీణ్ కుమార్ మాస్టర్ సమ క్షంలో ఇబ్రహీంపట్నం పోలీ స్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై నవీన్ కుమార్ జాతీ య స్థాయి బ్లాక్ బెల్ట్ డిప్లో మా ప్రశంసా పత్రాన్ని, మెరి ట్ విభాగంలో గెలుపొందిన బంగారు పథకాలను అంద జేసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సంద ర్భంగా ఎస్సై నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఇలాంటి కరాటే ఆత్మరక్షణ, యుద్ధ విద్యలు అందరూ వి ద్యార్థి దశ నుండే నేర్చుకో వాలని విద్యార్థులకు సూ చించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కరా టే శిక్షకులు ప్రవీణ్ కుమార్, ఫోటోగ్రాఫర్ ప్రదీప్, మధు, కరాటే మాస్టర్లు, నవీన్, వి శ్వ తేజ, కరాటే విద్యార్థు లు, తదితరులు పాల్గొన్నా రు.

# రైతాంగానికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీ పై అందించాలి

- **అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరాం డిమాండ్**



**ఆర్మూర్, జూన్, 03(పీపుల్స్ డైరీ) :** ఖరీఫ్ సీజన్లో రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు ఎరువులు పురుగు మందులు ఉచితంగా ఇవ్వాలని, పాత రుణాలు రద్దుచేసి కొత్తగా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆలూరు మండల కేంద్రంలో ఉన్న తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బీ.దేవరాం, జిల్లా ఉపాధ్యక్షుడు యు.రాజన్న , ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు జే .శేఖర్ మాట్లాడుతూ రైతాంగానికి వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు సగం సబ్సిడీ పై ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, కనీస మద్దతు ధరలు నిర్ణయించి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కల్తీ విత్తనాలు, పురుగుమందులను అరికట్టాలని,కల్తీ విత్తన వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని,అకాల వర్షాల వలన నష్టపోయిన అరటి,మామిడి ఇతర పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం భారతదేశ ఆర్థిక వ్యవస్థ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని,మోదీ పాలన గొప్పలు చెప్పుకుంటుందనారు . నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 సంవత్సరాల కాలంలో రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల మరియు గ్రామీణ సంపన్న వర్గాల అనుకూల విధానాలన్నిటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. దీనివలన స్వామినాథన్ కమిషన్ సిఫారసులు ప్రకారం మన రైతాంగానికి తమ పంటలకు కనీస మద్దతు ధర(మీస్రా) లభించడం లేదని వ్యవసాయ ఉత్పాదకాల( ఇన్ ఫుడ్స్ )ధరలు నిరంతరం పెరుగుతున్నాయని అనారు గ్రామీణ ప్రజలుకు భూమి లేని వారికి భూమి,ఇల్లు లేని వారికి ఇల్లు, ఉ ద్యోగం లేని వారికి ఉద్యోగం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, చిన్న సన్నకారు మరియు మధ్య తరగతి రైతులందరికీ పూర్తి రుణమాఫీ చేయాలని, కొత్తగా వడ్డీ లేని రుణాలు అందించాలని,రైతాంగ పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం మద్దతు ధరలు ఇవ్వాలని,మోడీ పాలన ఇండో అమెరికన్ వాణిజ్య ఒప్పందం ద్వారా మరియు మన వ్యవసాయాన్ని విదేశీ స్వదేశీ కార్పొరేట్లకు ద్వారాలు తెరవడం ద్వారా దేశ ప్రయోజనాలను, రైతు ప్రయోజనాలను తాకట్టు పెట్టే విధానాలను వెంటనే నిలిపి వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ జిల్లా కార్యదర్శి బి.కిషన్ , నాయకులు పస్క నాగేశ్వర్ , ఉంగరాల జగదీశ్వర్ , ఉంగరాల రాములు , గంగారం , ఎం.గంగారెడ్డి , ఎన్.సాయి రెడ్డి , లక్ష్మణ్ , యు. భూమన్న , యు గంగారం , ఎం.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిపెండెంట్ కార్మికులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలి

- **ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**
- **జిఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా, వినతి పత్రం అందజేత**



**భూపాలపల్లి జూన్ 03 పీపుల్స్ డైరీ :** సింగరేణిలో మెడికల్ ఆన్ ఫిట్ పొందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జిఎం కార్యాలయం ఎదుట సింగరేణి వ్యాప్తంగా 400 మంది కార్మికులు డీపెండెంట్ ఉద్యోగాలు పొంది ఉన్న వారికి నియామక పత్రాలు అందజేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొరిమి రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా వివిధ అనారోగ్య కారణాలవల్ల మెడికల్ అన్ఫిట్ పొందిన కార్మికుల పిల్లలకు సుమారు 400 మంది డిపెండెంట్ ఉ ద్యోగం పొంది ఉన్నారని వారికి ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం నియామక పత్రాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. వారిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఇల్లు గడవక దుర్భర జీవితాలు గడుపుతున్నారని అన్నారు. డిపెండెంట్ కార్మికులకు ప్రభుత్వం కేవలం నియామక పత్రాలు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. సింగరేణి వ్యాప్తంగా 400 మంది నియామక పత్రాలకు కోసం ఎదురుచూస్తున్నారని అందులో ఒక్క భూపాలపల్లి ఏరియా నుండి సుమారు 70 మంది డిపెండెంట్ కార్మికులు ఉద్యోగంలో ఆన్ ఫీట్ అయి ఉన్నారని, సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి నియామక పత్రాలు అందజేయకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే ప్రభుత్వం వారికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని కోరారు. గతంలో సింగరేణి భవనకు పిలిపించుకొని నియామక పత్రాలు ఇచ్చేవారని జూన్ 2న కార్మికులకు ఉద్యోగం నియామక పత్రాలు అందజేస్తారని ఎదురు చూసిన కార్మికులకు నిరాశ ఎదురైందని చెప్పారు. ఓపిక నశించి ఈరోజు సింగరేణి వ్యాప్తంగా అన్ని జిఎం కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే జూన్ నెలలో సమ్మె కైనా సిద్ధమేనని హెచ్చరించారు. అనంతరం డిపెండెంట్ లకు కార్మికులకు నియమాక పత్రాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు ఆసిఫ్ పాషా, జి శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, బ్రాంచ్ కమిటీ నాయకులు తోట రామచందర్, ఫిట్ సెక్రటరీలు రాజేందర్, గణేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్, సుమారు 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులపై గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి జూన్ 03 పీపుల్స్ డైరీ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు,.మున్సిపాలిటీలో గ్రామ, వార్డు సభలు సమ-ర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం నుండి ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో అన్ని గ్రామపం చాయతీలు, మున్సిపాలిటీలలోని వార్డులలో నిర్వహించనున్న సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారుల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటాలని తెలిపారు. మురుగుకాల్వలు పరిశుభ్రం చేయుట, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వెళ్లకుండా కమ్యూనిటి, వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదే శించారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బ ందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేం దుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. గ్రామసభలలో మహిళల రక్షణ, బాల్య వివాహాలు, మాద కద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ అకాల వర్షాల వల్ల వాగులు వంకలు పొంగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ప్రజలను తరలించేందుకు అవగహన కల్పించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఎన్ లినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలు కాల్చొద్దని దాని వల్ల భూమిలో ఉన్న పోషకాలు చనిపోతాయని కలియదున్నడం వల్ల భూమికి బలం పెరుగుతుందని తెలిపారు. ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు మండల, డివిజన్ స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలలో పోలీస్ అధికారులు పాల్గొనాలని ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పిడుగుల వల్ల తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తేదీన జరుగనున్న ప్రతి గ్రామసభలో అరైవ్ ఎలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రహదారి సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 12వ తేదీన డ్రగ్స్ మహమ్మారిపై జరుగనున్న సభలలో ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయిస్తే పిడి యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. సీజన్ కు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిపిఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,వ్యవసాయ అధికారి బాబురావు, డిఆర్డీఓ బాల కృష్ణ, విద్యుత్, విద్య, ప్రణాళిక, తదితర శాఖల అధికారులతో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలి



**భూపాలపల్లి జూన్ 03 పీపుల్స్ డైరీ :** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. ప్రత్యేక ఓటరు సవరణపై బుధవారం ఐడిఓసి కార్యాలయం నుండి రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా 01.10.2026 ను అర్హత తేదీగా నిర్ణయించి షెడ్యూల్ విడుదల చేశారని అప్పటి వరకు 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరు నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా 25.06.2026 నుండి 24.07.2026 వరకు బూతు స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని, బూతు స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవాలని ఏవైనా పొరపాటు ఉంటే బూతు స్థాయి అధికారులకు తెలియ చేయాలని తెలిపారు. బూతు స్థాయి అధికారి ప్రతి ఇంటిని తప్పంకుండా మూడు సార్లు సందర్శించాలని తెలిపారు. ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా అవసరమైన ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని, బూతు స్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 31.07.2026 న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, తదుపరి 31.07.2026 నుండి 30.08.2026 వరకు అభ్యంతరాలు మరియు క్లెయిమ్‌లు స్వీకరించాలని తెలిపారు. కొత్త ఓటర్లు నమోదు కావడానికి ఫారం-6, వివరాల సవరణ లేదా మార్పుల కోసం ఫారం-8 లో దరఖాస్తు చేయాలని తెలిపారు. వచ్చిన అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లు పరిశీలించిన అనంతరం తుది ఓటరు జాబితా 01.10.2026 న ప్రచురించబడుతుందని తెలిపారు. జిల్లాలోని అర్హత గల ఓటర్లు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని, తమ ఓటు హక్కు నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ...**

పోలీస్ సిబ్బంది ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బందోబస్తు లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని మండలాల తహసిల్దారులు ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఏ కార్యాలయాల్లో 'సంతల' పాలన.. రూల్స్ ఒకరికే, లంచాలు ఇస్తే అందరికీ!



- ప్రత్యేక ప్రతినిధి .. గోపీ బొడ్డు క్షేత్రస్థాయి పరిశీలన

**ఆర్మూర్, జూన్, 03(పీపుల్స్ డైరీ) :** సామాన్యుడు లైసెన్స్ కోసం వెళ్తే ఒక రూల్.. అదే బ్రోకర్ ద్వారా వెళ్తే మరో రూల్! రోడ్డు రవాణా శాఖ (RTA) విధివిధానాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాలు, అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులపై అవినీతి నిరోధక శాఖ జరిపిన ఆకస్మిక దాడులు ఈ వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతి తిమింగలాలను, దళారుల నెట్‌వర్క్‌ను నిలువునా బట్టబయలు చేశాయి. ప్రజల భద్రతను గాలికొదిలేసి, నిబంధనలను తుంగలో తొక్కుతూ సాగుతున్న ఈ 'రవాణా దోపిడీ'పై ప్రత్యేక కథనం.

### నిబంధనలు ఏం చెప్తున్నాయి? (విధి విధానాలు)

మోటార్ వాహనాల చట్టం (వీఎాఫీ) ప్రకారం రోడ్డు రవాణా శాఖ ప్రధాన విధి.. రహదారి భద్రతను పర్యవేక్షించడం మరియు పారదర్శకమైన సేవలను అందించడం.

### కంప్యూటరైజ్డ్ డ్రైవింగ్ టెస్ట్

లైసెన్స్ ఇచ్చే ముందు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా టెస్ట్ ట్రాక్‌పై వాహనం నడిపి ఉత్తీర్ణత సాధించాలి. ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్: మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలే నేరుగా ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకోవాలి.

### పోస్టల్ డెలివరీ

ప్రింట్ అయిన డ్రైవింగ్ లైసెన్సులు (ఙూ), రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు నేరుగా దరఖాస్తుదారుడి ఇంటి చిరునామాకే పోస్ట్ ద్వారా వెళ్లాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ( భారీ వాహనాలు, కమర్షియల్ వాహనాల కండిషన్ సరిగ్గా ఉందో లేదో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయాలి.

### క్షేత్రస్థాయిలో అక్రమాల పర్వం.. (అవకతవకలు)

ప్రభుత్వం ఎన్ని ఆన్‌లైన్ విధానాలు తెచ్చినా, క్షేత్రస్థాయిలో మాత్రం 'చేతులు నలిపితేనే' ఫైళ్లు కదులుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లోని మేడ్చల్, కొండాపూర్, నాగోల్ ఆర్‌టీఏ ఆఫీసులపై ఏసీబీ అధికారులు జరిపిన దాడుల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

### 1. కోడింగ్ సిస్టమ్.. దళారుల రాజ్యం!

ఆర్టీఏ కార్యాలయాల్లోకి అనధికార వ్యక్తులకు ప్రవేశం లేదని బోర్డులు ఉంటాయి. కానీ, లోపల ప్రభుత్వ ఉద్యోగుల కంటే డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు, దళారులదే హవా. దరఖాస్తులపై నిర్దిష్టమైన 'కోడ్ గుర్తులు' (ఏజెంట్ రెఫరెన్స్) ఉంటేనే అధికారులు ఫైళ్లను అభ్యంతరం చెప్పకుండా క్లియర్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుడు రాకపోయినా, లెర్నర్ లైసెన్సులు, పక్కా లైసెన్సులు మంజూరు అయిపోతున్నాయి.

### 2. ఆర్సీలు, లైసెన్సులు దళారుల జేబుల్లో..

పోస్ట్ ద్వారా ప్రజల ఇళ్లకు చేరాల్సిన వందలాది ఒరిజినల్ ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు ఆఫీసుల్లోని డిస్పాచ్ సిబ్బంది నేరుగా దళారుల చేతుల్లో పెడుతున్నారు. ఇటీవలి దాడిలో ఒక్క ఏజెంట్ వద్దే ఏకంగా 184 ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సులు దొరకడం ఈ అక్రమ బంధానికి సజీవ సాక్ష్యం. దరఖాస్తుదారుడి నుంచి అదనపు డబ్బులు వసూలు చేయడానికే ఈ పద్ధతి వాడుతున్నారు.

### 3. టెస్ట్ ట్రాక్‌లపై ప్రహసనం!

నాగోల్ ఆర్‌టీఏ కార్యాలయంలో ఏసీబీ పరిశీలించిన 185 డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల్లో ఒక్కటి కూడా రిజెక్ట్ కాకపోవడం గమనార్హం. అంటే టెస్ట్ సరిగ్గా పెట్టకుండానే, డ్రైవింగ్ స్కూల్స్ ఇచ్చిన లిస్టు ప్రకారం అందరినీ పాస్ చేసేశారు. అర్హత లేని వారికి ఇలా లైసెన్సులు ఇవ్వడం వల్లే రహదారులపై ప్రమాదాలు పెరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### 4. అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద 'మామూళ్ల' పండుగ

రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టులు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఓవర్‌లోడ్ వాహనాలు, పర్మిట్లు లేని లారీలను తనిఖీ చేయాల్సిన అధికారులు.. ప్రైవేట్ పెట్టుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. రాత్రి వేళల్లో సాగే ఈ దందాలో లక్షలాది రూపాయల లెక్కల్లో లేని నగదు ఏసీబీ దాడుల్లో సీజ్ అయ్యింది.

### రోడ్డు భద్రతకు ముప్పు.. ప్రజల డిమాండ్

ఈ అవకతవకల వల్ల కేవలం ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, అన్‌ఫిట్ వాహనాలు రోడ్లపైకి రావడం, డ్రైవింగ్ రాని వారికి లైసెన్సులు లభించడం వల్ల సామాన్య ప్రజల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారుతున్నాయి.

### ప్రజల డిమాండ్."

రవాణా శాఖలో ప్రక్షాళన జరగనంత కాలం.. సామాన్యుడికి ఇబ్బందులు తప్పవు, రహదారి భద్రతకు గ్యారంటీ ఉండదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. --ఈ చాయ్ పే చర్చ లో ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్ మాట్లాడుతూ ప్రజలు,వాహన దారులు ఏ పరిస్థితి లోను ఏజెంట్స్ లను కలవవద్దని, ఏవైన అనుమానాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పీపుల్స్ డైరీ దినపత్రిక ప్రతినిధి బొడ్డు గోపి తో తెలియజేశారు.

# వరికొయ్యల మంటల వల్ల ఆయిల్ పామ్ తోట ఆహుతి

- హుజురాబాద్ మండలం
- వెంకట్రావుపల్లిలో విషాద ఘటన



**హుజురాబాద్, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** వరికొయ్యలను తగలబెట్టడం ఎంత ప్రమాదకరమో మరోసారి నిరూపించే ఘటన హుజురాబాద్ మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పొరుగు పొలాల్లో వేసిన వరికొయ్యల మంటలు వ్యాపించి ఓ రైతుకు చెందిన ఆయిల్ పామ్ తోట పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన రైతు కన్నెబోయిన మహేందర్‌కు చెందిన ఆయిల్ పామ్ తోట సమీపంలో కొందరు రైతులు పంట కోతల అనంతరం మిగిలిన వరికొయ్యలను తగలబెట్టారు. ఎండ తీవ్రతతో పాటు గాలివేగం ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న తోటను చుట్టుముట్టాయి. రాత్రి వరకు మంటలు ఎగిసిపడటంతో సుమారు 45 ఆయిల్ పామ్ చెట్లు పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం. తోటతో పాటు చుట్టుపక్కల ఉన్న వరికొయ్యలు, ఇతర పంట అవశేషాలు కూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తక్షణమే స్పందించకపోతే మొత్తం తోట పూర్తిగా నాశనమయ్యేదని రైతు మహేందర్ ఆవేదన వ్యక్తం చేశాడు. వరికొయ్యలను తగలబెట్టడం వల్ల భూమిలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారత తగ్గిపోవడమే కాకుండా ఇలాంటి ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని వ్యవసాయ అధికారులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. పంట అవశేషాలను కాల్చవద్దని వ్యవసాయ శాఖ తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు రైతులు పాత పద్ధతులనే కొనసాగించడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో కూడా వరికొయ్యల మంటల వల్ల గడ్డి వాములు, విద్యుత్ మోటార్లు, వైర్లు దగ్ధమైన ఘటనలు చోటుచేసుకున్నాయని అధికారులు గుర్తు చేస్తున్నారు. రైతులు ఇకనైనా అప్రమత్తంగా ఉండి పంట అవశేషాలను తగలబెట్టే అలవాటును మానుకోవాలని, లేదంటే భారీ నష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# సినిమా షూటింగ్‌లో గుండెపోటుతో జూనియర్ ఆర్టిస్ట్ మృతి

- కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం మేడ్చల్ పోలీసులు విజ్ఞప్తి



**మేడ్చల్, జూన్ 3(పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునీరాబాద్‌లో ఉన్న ఓన్వ కన్వెన్షన్‌లో సినిమా షూటింగ్ సందర్భంగా ఓ జూనియర్ ఆర్టిస్ట్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మే 30, 2026 రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న జూనియర్ ఆర్టిస్ట్ ఆర్.ఎం.వి. భాస్కర్ (కార్డు నం. 2212), వయస్సు 52 సంవత్సరాలు, అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన వద్ద లభించిన ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు ఆధారంగా కోల్‌కతా చిరునామా ఉన్నట్లు గుర్తించినప్పటికీ, కుటుంబ సభ్యుల సంప్రదింపు వివరాలు అందుబాటులో లేవని తెలిపారు. ఆయన మొబైల్ ఫోన్‌లో సహచర జూనియర్ ఆర్టిస్టులు, ఏజెంట్‌కు సంబంధించిన ఫోన్ నంబర్లు మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. ఆర్.ఎం.వి. భాస్కర్ కుటుంబ సభ్యులు, బంధువులు లేదా స్వగ్రామం గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే మేడ్చల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. మృతుడి కుటుంబ సభ్యులను గుర్తించి చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయడానికి ప్రజల సహకారం అవసరమని విజ్ఞప్తి చేశారు.

# విద్యుత్ వినియోగదారుల తక్షణ పరిష్కారం

విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలరావు

**ఏటూరు నాగారం జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** విద్యుత్ వినియోగదారులకు తక్షణ పరిష్కారం కోసమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు సీజీఆర్ఎఫ్(విద్యుత్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ) చైర్మన్ వేణుగోపాలచారి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో వినియోగదారుల ఫోరం వేదికలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులు వినియోగదారుల సమస్యలను పట్టించుకోకపోతే ఫోరంకు ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు తీసివేయడం, కొత్తవి మార్చడం, మీటర్ల ను అమర్చడం, బిల్ అధికంగా రావడం వంటి సమస్యలను మా ఫోరం సమస్యను పరిష్కరిస్తోంది. ఏటూరునాగారం మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు వెంట ఉన్న స్తంబాలు కొత్తవి వేయాలని, తీగలను అమర్చాలని పలువురు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అధికారులను ఆదేశించి స్తంబాలను నూతనంగా అమర్చాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. 1912కు కూడా సమాచారం అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. 33 కేవీలైన్స్‌లో కూడా లూజు లైన్స్ ఉన్న ప్రాంతాల్లో కొత్తవి పోల్స్ వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. స్థానికంగా ఈఆర్ఓ కార్యాలయం అధికారులు బిల్లుల హెచ్చుతగ్గుల విషయాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వాట్సప్‌లో కూడా ఫిర్యాదు చేసే అవకాశాలను కల్పించామన్నారు. వెనుకబడిన ప్రాంతాలు కావడం తోపాటు గాలి దుమారాలు వచ్చే ప్రాంతం కావడంతో ఇక్కడ వాటిని తట్టుకునేందుకు 200 కిలోల బరువు ఉన్న సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేయడం కోసం ఇప్పటికే సీఎండీ ద్వారా అమనుతి వచ్చిందని, త్వరలోనే గాలి దుమారాలను తట్టుకునే పోల్స్ వేస్తారని ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ శాఖలో పనిచేసే అధికారులు వినియోగదారులు చెప్పిన ఫిర్యాదును పట్టించుకోకపోతే వాటిని వెంటనే పరిష్కరిస్తూ వినియోగ దారుడికి న్యాయం చేస్తామన్నారు. సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫైనాన్స్ సభ్యుడు దేవేందర్, ఇండిపెండెంట్ సభ్యుడు రామారావు, డీఈ పురుషోత్తం, ఏడీఈ ఉమారావు, సబ్ ఇంజనీర్లు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.




# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**మేడ్చల్, జూన్ 3(పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ పట్టణంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కాయిత ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో సీఎంఆర్ హాస్పటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పలువురు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంఆర్ హాస్పటల్ చైర్మన్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామాలు, పట్టణాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పేద ప్రజలు ఎప్పుడైనా సీఎంఆర్ హాస్పటల్‌ను సందర్శించి ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే శస్త్రచికిత్సలు అవసరమైన నిరుపేద రోగులకు కూడా తమ ఆసుపత్రి లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. మేడ్చల్‌లో నిర్వహించిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిం దని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో వివిధ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాయుడు, అనుదీప్, కౌశిక్‌తో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటేష్, యాదగిరి, లింగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పలు సమస్యలపై ఎంపీడీవోకు వినతి

పలు సమస్యలపై ఎంపీడీవోని కలిసి వినతి పత్రం అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చిటమట రఘు



**ఏటూరు నాగారం జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్క ఆదేశాల మేరకు పైడాకుల అశోక్ అన్న గారి సూచన మేరకు. ఈరోజు ఉదయం 11 గంటలకు ఏటూరునాగారం మండల ఎంపీడీవో ఆఫీస్ లో ఎంపీడీవో గారిని మర్యాదపూర్వకంగా కలసి మండలంలో ఉన్న పలు సమస్యలపై వినతిపత్రంపలు సమస్యలపై బుధవారం ఎంపీడీవోని కలిసి వినతి పత్రం అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చిటమట రఘు మరియు కొండాయి సర్పంచ్ మానస నాగార్జున్ అందజేయడం జరిగింది. ఇట్టి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకొని వెంటనే పరిష్కరించవలసిందిగా కోరినారు. అదేవిధంగా గ్రామాల్లో వచ్చిన అభివృద్ధి పనులు వెంటనే చేయాలని, రానున్నది వర్షాకాలం కాబట్టి పనులకు అంతరాయం కలుగుతుందని వెంటనే అభివృద్ధి పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాయం కమలక్క తదితరులు పాల్గొన్నారు...

# ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**కోహెడ జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** అపర భగీరథుడు కరువుతో అల్లాడుతున్న తెలంగాణ ప్రాంతాన్ని కాలేశ్వరం నీళ్లతో రైతుల బాధలు తీర్చిన మహానేత భావి తెలంగాణ రథసారధి మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదిన వేడుకలు శనిగరం గాంధీ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు హరీష్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రజాసేవలో ముందు ముందు ఇంకా ఉన్నతమైన స్థానాలలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమం లో గ్రామ సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య సీనియర్ నాయకులు అబ్దుల్ రహీం కర్ర బిక్షపతి మరియు వార్డు సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు బి.ఆర్.ఎస్ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు హరీష్ రావు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేరుగు రాజు నియామకం



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 03 :** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన మేరుగు రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేరుగు రాజు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి అన్ని విధాలుగా సహకరించిన చొప్పదండి శాసనసభ్యులు కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు చెప్పారు. ఎస్సీ డిపార్ట్మెంట్ తరఫున రాష్ట్ర చైర్మన్ ఏ పిలుపునిచ్చినా ముందుండి ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని తెలియజేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ పెద్దలు రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జ్ పూజలు హరికృష్ణకి కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ప్రెస్ క్లబ్ అధ్య క్షులు డాక్టర్ బూరం సం జీవ్ జన్మదిన వేడుకలు



**మెట్ పల్లి జూన్ 3 :(పీపుల్స్ డైరీ) :** టీయూడబ్ల్యూజే (ఐజే యు) ప్రింట్ మీడియా మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్ పుట్టి నరోజు వేడుకలను పట్టణం లో ఘనంగా నిర్వహించా రు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి, కేక్ కటిం గ్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అజీమ్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్, పింజరి శివ,జిల్లా కార్యవర్గ సభ్య లు, బాషెట్టి హరీష్,సాజిద్, సమీ, ఈసి మెంబర్లు అహ్మ ద్, సోహైల్, రఫీ,గంగాధర్, అమ్ముల ప్రవీణ్,మాజీ అ ధ్యక్షుడు ఆగ సురేష్, అ ప్పం చిన్నారెడ్డి, బురాం నా రాయణ,మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, 20 వ,వార్డు కాన్సిలర్ మసూల ప్రవీణ్, మాజీ పట్టణాధ్యక్షు డు కుతుబొద్దీన్ పాషా, ఏశ మేని గణేష్,న్యాయవాది రాంపెల్లి జగన్, గోదూరు టీ వీ ఫోక్ ఛానెల్ ఫేం గోపు ల లితమ్మ లు పాల్గొన్నారు

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 03 :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కట్టా కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గం ప్రజలందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కట్టా కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర నాయకులు ఒక్కంటి దయాకర్, బీజేపీ పార్టీ నాయకులు, బీఎంఎస్ యూనియన్ సభ్యులు, సాయిబాబా నగర్ డివిజన్ బీజేపీ నాయకులు సౌరభ్ సింగ్ మరియు ఇతర ప్రముఖులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానికులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి, తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ కట్టా కుమార్ మరియు నాయకులు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# హరీశ్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 03 :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని నాంపల్లి యూసఫైన్ దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని దర్గాలో ప్రత్యేక దువాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ మైనార్టీ విభాగం వైస్ ప్రెసిడెంట్ షాహిద్ అహ్మద్ మాట్లాడుతూ హరీశ్ రావు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమం కాంతుల రమేష్ సహకారంతో ఘనంగా నిర్వహించబడింది. పలువురు మైనార్టీ నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రార్థనల అనంతరం దేశం, రాష్ట్రం శాంతి–సౌభాగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.

# ఆర్థిక సహాయం

## లక్ష్మణ్ నాయక్‌కు ఆర్థిక సహాయం అందజేసిన మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 03 :** గాగిల్లాపూర్ తండాకు చెందిన కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆయన దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో వైద్య పరీక్షలు చేయించుకోగా, ఆయన రెండు కిడ్నీలు మరియు లివర్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. లక్ష్మణ్ నాయక్ కుటుంబం అత్యంత దయనీయ స్థితిలో ఉంది. ఆయనకు పెళ్లి కావాల్సిన నలుగురు ఆడపిల్లలు మరియు ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి అనారోగ్యంతో ఉండటంతో కుమారుడు చదువు మానేసి ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న దుండిగల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ లక్ష్మణ్ నాయక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయంగా రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు. చాలి చాలినంత ఆదాయంతో కష్టాలలో ఉన్న ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రతి ఒక్కరినీ కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మరియు మాజీ మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా ప్రయత్నిస్తానని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ తెలిపారు.

# ఎల్లాపూర్ స్లీపర్ కంపెనీలో సైబర్ అవేర్నెస్ కార్యక్రమం



**హసన్‌పర్తి, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** ఎల్లాపూర్ స్లీపర్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక సైబర్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులకు సైబర్ భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా లాగిన్ భద్రత, ఫిషింగ్ మోసాలను గుర్తించే విధానం, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, సోషల్ ఇంజినీరింగ్ ద్వారా జరిగే మోసాలు వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. అలాగే సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత మరియు సంస్థ డేటాను రక్షించుకునే మార్గాలపై ప్రాక్టికల్ సూచనలు అందించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, "సైబర్ భద్రత అనేది కేవలం ఐటీ విభాగం బాధ్యత మాత్రమే కాదు. ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉంటేనే సంస్థ డేటా సురక్షితంగా ఉంటుంది. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఉద్యోగుల్లో బాధ్యతను పెంచుతాయి" అని పేర్కొన్నారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ భద్రతపై సరైన అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో ఎదురయ్యే అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# నూతనకల్ అంగన్వాడీల్లో సిబ్బంది కొరత

## రెండు నెలల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని డీడబ్ల్యూఓ శారద హామీ

**మేడ్చల్, జూన్ 3 (పీపుల్స్ డైరీ):-** నూతనకల్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ ప్రజల తరఫున జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి శారదకు కౌన్సిలర్లు 16వ వార్డు సద్ది సురేష్ రెడ్డి, 21వ వార్డు చిన్నోల భాస్కర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు ఉన్నప్పటికీ, రెండు కేంద్రాల్లోనూ అంగన్వాడీ టీచర్లు లేకపోవడంతో ఒక కేంద్రం పూర్తిగా మూతపడిందని, మరొక కేంద్రం ఇతర గ్రామానికి చెందిన ఇన్‌చార్జి ఆధ్వర్యంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆ కేంద్రంలో కూడా ఆయా (హెల్పర్) లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు నాలుగు వేలకుపైగా జనాభా కలిగిన నూతనకల్



గ్రామంలో గర్భిణీ స్త్రీలకు పోషకాహారం అందించడంలో, చిన్నారులకు అంగన్వాడీ సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నూతనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక ఆశా వం-్కర్ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉందని తెలిపారు. కావున రెండు అంగన్వాడీ కేంద్రాలకు ఇద్దరు టీచర్లు, ఇద్దరు హెల్పర్లను నియమించడంతో పాటు ఆశా వర్కర్ ఖాళీ పోస్టును కూడా భర్తీ చేసి గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీడబ్ల్యూఓ శారద సానుకూలంగా స్పందిస్తూ, రెండు నెలల్లో అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# వరి కొయ్యలు కాల్చొద్దు.. భూసారం పెంచే పద్ధతులను పాటించండి

## వ్యవసాయ అధికారి ప్రియదర్శిని

**దుబ్బాక ప్రతినిధి, జూన్ 03 :** దుబ్బాక నియోజకవర్గం బల్వంతాపూర్ గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి కోత అనంతరం కొయ్యలు (పంట అవశేషాలు) కాల్చడం వల్ల కలిగే నష్టాలు, వాటిని నేలలో కలియదున్నడం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమిలోని సేంద్రియ పదార్థాలు, ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గుతుందని తెలిపారు. కొయ్యలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా భూసారం మెరుగుపడి, పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. గడ్డి త్వరగా కుళ్లిపోవడానికి ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) చల్లాలని రైతులకు సూచించారు. దీంతో భూమి సారవంతత పెరగడంతో పాటు ప్రయోజనకరమైన సూక్ష్మజీవుల వృద్ధికి దోహదం చేస్తుందని వివరించారు. వరి కొయ్యలను కాల్చడం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిషేధమని, పంట అవశేషాలను తగలబెట్టిన రైతులపై జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. సాధారణంగా వ్యర్థాలను కాల్చితే రూ.5,000, భారీ స్థాయిలో కాల్చితే రూ.25,000 వరకు పర్యావరణ పరిహారం విధించబడుతుందని తెలిపారు. ఈ మొత్తాన్ని భూమి ఆదాయ బకాయిల మాదిరిగా వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనకవ్వ, వ్యవసాయ విస్తరణ అధికారి సంధ్య, పంచాయతీ కార్యదర్శి సతీష్‌తో పాటు 54 మంది రైతులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, భూసార సంరక్షణ కోసం రైతులు వరి కొయ్యలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# కోహెడ మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**కోహెడ జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** కోహెడ గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక సంజీవనిలా మారిందని కోహెడ గ్రామ సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్ పేర్కొన్నారు. బుధవారం నాడు కోహెడ గ్రామ పంచాయతీ కార్యాలయం లో వివిధ అనారోగ్య సమస్యల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్, ఉప సర్పంచ్ కందాల వెంకటేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముంజ తిరుపతి గారు మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో భారీ ఖర్చులతో వైద్యం చేయించు కుని ఆర్థికంగా కుదేలైన నిరుపేదలను ఆదుకోవడాని కి ప్రభుత్వం ఈ నిధులను అందిస్తోందని, ప్రజా సంక్షేమ మే ధ్యేయంగా గ్రామ అభివృద్ధి కి, ప్రజా సేవకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన లబ్ధిదారులు గుళ్ళ శ్రీరామ్, యాద రాములు, రేవోజు రాజమణి, ఒగ్గు లక్ష్మి, ముంజ సులోచన,పోచయ్య, అద్ల బాలవ్వ, జెట్టి అంజి, తలారి పోచవ్వలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చుక్క శంకర్, గుగిళ్ళ శ్రీను, గజ్జెల ప్రవీణ్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొమ్మాట జగన్ రెడ్డి, వేల్పుల వెంకటస్వామి, సంతోష్ రెడ్డి, గోవిందు రమేష్, పల్లె భూం రెడ్డి, చుక్క అశోక్, పోతిరెడ్డి సదానందం మాజీ ఉప సర్పంచ్ యాద అశోక్ తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నందుకు లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు ప్రతినిధులు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యపై డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు వినతి

**పటాన్చెరు, జూన్ 3 :**రామచంద్రపురం పట్టణంలో నెలకొన్న తీవ్రమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య, త్రాగునీరు మరియు భూగర్భ జలాల కలుషితంపై హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ అమీన్పూర్/రామచంద్రపురం డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను కలిసి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలేష్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం 268, భారతి నగర్ 269 డివిజన్ల పరిధిలోని అనేక కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. డ్రైనేజీ లీకేజీల కారణంగా మంచినీటి పైపులైన్లు, బోరుబావులు, భూగర్భ జలాలు కలుషితమవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అదేవిధంగా పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ కవర్లు ధ్వంసమై ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చోట కొత్త డ్రైనేజీ లైన్లు, మంచినీటి పైపులైన్లు ఏర్పాటు



చేయడంతో పాటు ధ్వంసమైన మ్యాన్‌హోల్ కవర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యం, భద్రతను నిర్లక్ష్యం చేస్తే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.దీనిపై స్పందించిన డిప్యూటీ జనరల్ మేనేజర్ త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐలేష్ --- మాజీ జీహెచ్ఎంసీ వార్డ్ కమిటీ మెంబర్, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవలపై సమీక్ష



**మట్టెవాడ, జూన్ 03 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి పనులు, వైద్య సేవల నాణ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతుల మెరుగుదలపై సమావేశం లో విస్తృతంగా చర్చించి సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే వరంగల్ జిల్లా కలెక్టర్, కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్యశారద, హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి (కమిటీ కన్వీనర్), ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, అడ్మినిస్ట్రేటివ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, వైద్య సేవల విస్తరణ, రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పన, అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.



## మానసిక దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ

**మట్టెవాడ, జూన్ 03 (పీపుల్స్ డైరీ):** హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొని సుమారు 70 మంది మానసిక దివ్యాంగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందచేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. రక్తపోటు, షుగర్ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనురాగ్ సొసైటీ, వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థల నేషనల్ వైస్ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అన్నారు. కార్యక్రమంలో మల్లికాంబ కేంద్రం నిర్వాహకులు కోడం కళ్యాణ్ కుమార్, వసంత, శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బి.మల్లేశం, ఎస్.కృష్ణకళ, కె.శివకుమార్, ఎం.రాజేష్, ఆశాలు బి.శ్రీలత కె.రాజశ్రీ పాల్గొన్నారు.

## కొత్తవాడలో సామూహిక శ్రీమంతం



**మట్టెవాడ, జూన్ 03 (పీపుల్స్ డైరీ):** అసోసియేషన్ అఫ్ ఆలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వరంగల్ 192, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆలయ్ పెంటకుమార్ జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం కొత్తవాడలోని పద్మశాలి ట్రస్ట్ భవనం సామూహిక శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడ్వైసర్ ఆలయ్ మంత్రి లింగమూర్తి, మాజీ గవర్నర్లు ఆలయ్ కుసుమ లింగమూర్తి, ఆలయ్ చంద్రపాలక శామ్యూల్, ఆలయ్ చిప్ప వెంకటేశ్వర్లు, ఆలయ్ వాణిమూర్తి, మల్టీపుల్ కోఆర్డినేటర్ ఓంకారలింగం శాస్త్రి, డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఆలయ్ దస్తగిరి, ట్రెసారర్ అలయ్ దోమల నాగేందర్, ఆర్.సి ఆలయ్ స్రవంతి, వరంగల్ క్లబ్ ప్రెసిడెంట్ అలయ్ ఎలుగం వెంకటమల్లు, వైస్ ప్రెసిడెంట్ ఆలయ్ ఎలిగేటి శ్రీనివాస్, ఆలయ్ గాదె రాధిక, ఆలయ్ మంత్రి విజయ, సి.డి.పి.వో.పి.విద్య, సూపర్ వైజర్ టి.పద్మావతి, అంగన్వాడీ ఉపాధ్యాయులు జోష్న, రాజేశ్వరి, ఆశ వర్కర్ ఎం.మమత ఎలుగం చిన్న కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు చేయాలి




**చిట్యాల, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ బందు సుజాత అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ హాజరై మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న యజమాన్యంపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేటుకు అమ్మితే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. విత్తనాలు కొన్న ప్రతి రైతుకు కంప్యూటర్ బిల్లు ఇవ్వాలని గ్రామాల్లో ఉన్న షాపులలో తనిఖీలు నిర్వహించాలన్నారు. నకిలీ విత్తనాలతో పెట్టిన పెట్టుబడి రాక రైతులు ఇబ్బంది పడుతుంటే ఎరువుల ధరలు మాత్రం విపరీతంగా పెంచుతున్నారని తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఆత్కూరి శ్రీకాంత్ బుర్ర స్వాతి క్రాంతి రవి పాల్గొన్నారు.

## రాహుల్ ముదిరాజ్ మృతి బాధాకరం : సమ్మయ్య గౌడ్



**కేసముద్రం, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువకుడు నూకల రాహుల్ ముదిరాజ్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం తీవ్ర విషాదకరమని సమ్మి గౌడ్ పునాది వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బతుకుదెరువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరిలో నివసిస్తూ ఉద్యోగం చేస్తున్న రాహుల్, విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు ఏం జరిగిందో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విషాద వార్త తెలుసుకున్న వెంటనే ఉప్పరపల్లి గ్రామానికి చేరుకున్న సమ్మయ్య గౌడ్, రాహుల్ భౌతిక కాయానికి పూలమాల వేసి అశ్రునివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని చివరి వీడ్కోలు పలికారు. యువకుడి మృతితో కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.

## సభకు అనుమతి నిరాకరణ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం



**చిట్యాల, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 2 వేల మంది సభ్యులతో నిర్వహించ తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని భూపాలపల్లి జిల్లా జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని జనసేన పార్టీ జిల్లా నాయకులు దేవేందర్ కంకనాల అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం నాయకులతో కలిసి మాట్లాడుతూ శాంతిభద్రతల పేరుతో సభకు అనుమతి నిరాకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో సభ నిర్వహించాలంటే ఎందుకు భయపడుతున్నారో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. కొంతమంది వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణకు తామే యజమానులమన్నట్లు వ్యవహరించడం తాము చెప్పిందే జరగాలనే ధోరణితో మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్లు లేక రోడ్లపై ఆందోళనలు చేస్తున్నా వాటిని పట్టించుకోని వారు ప్రజా సమస్యలను పక్కనబెట్టి పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేయడం విచారకరమన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఏ పౌరుడైనా ఎక్కడి నుంచైనా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కలిగి ఉన్నాడని ఈ విషయాన్ని విస్మరించి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ప్రయత్నాలను జనసేన పార్టీ ఎప్పటికీ సహించదన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ టేకుమట్ల మండల కో-ఆర్డినేటర్ జంగా మధుకర్ పాల్గొన్నారు.

## పది ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం



**కేసముద్రం, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం స్టేషన్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందెల రాజు జాతీయ జెండా ఆవిష్కరణ గావించారు అనంతరం 2025 - 26 సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో కేసముద్రం మండలంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని మొహమ్మద్ అఫ్రా నిక్హత్‌ను ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఘనంగా సత్కరించారు. అలాగే 500 పైగా మార్కులు సాధించిన మరో ఆరుగురు విద్యార్థులు జుజ్జురు ఝాన్సీ, మొహమ్మద్ నఫియా, సనుప మహేష్, తాటికొండ తేజన్య, మొహమ్మద్ అలీషా అబీబా, జాటోత్ శివరాం కూడా సన్మానించారు. అనంతరం బడిబాట కార్యక్ర మంపై సన్నాహక సమావేశం నిర్వహించి ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేవే ప్రభుత్వ బడులు. ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలో మట్టిలో మాణిక్యాలను తయారు చేసే బాధ్యత మనమంతా తీసుకోవాలని కోరారు. మండల కేంద్రంలో ఉన్న పాఠశా ల అడ్మిషన్లను అధిక స్థాయిలో చేయించి భవిష్యత్తులో ప్రతి విద్యార్థి కూడా ప్రభుత్వ పాఠశాల లోనే చదువుకునే విధంగా ఉపాధ్యా యుల కృషి చేయాలని చెప్పారు. అలాగే బడిబాట గోడపత్రికను కూడా ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఆవిష్కరించారు. పదవ తరగతి ఫలితాల లో కూడా 566 మార్కులతో మండలంలోని ప్రథమ స్థాయిలో నిలిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**చిట్యాల, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని జూకల్ గ్రామంలో వడదెబ్బ వలన మృతి చెందిన మాశబోయిన రాజయ్య కుటుంబ సభ్యులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడదెబ్బ కారణంగా మృతి చెందిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలను అందిస్తాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వృద్ధుడి మృతి



**చిట్యాల, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని జూకల్ గ్రామానికి చెందిన మాశబోయిన రాజయ్య (65) అనే వృద్ధుడు వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం సుమారు 7:30 గంటల ప్రాంతంలో రాజయ్య చల్లగరిగ గ్రామ శివారులోని సర్వే నంబర్ 360/ఏ తను కౌలుకు తీసుకున్న పొలంలో మక్కజొన్న చొప్ప కలపెట్టేందుకు వెళ్ళాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 11:30 గంటల సమయంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురై పక్కనే ఉన్న చెట్టు కింద స్పృహతప్పి పడిపోయాడు. ?ఇది గమనించిన సమీపంలోని వ్యక్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు మాశబోయిన రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## అభివృద్ధి, అంకితభావానికి మారుపేరు హరీష్‌రావు

### మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి ఫరీద్ ఆధ్వర్యంలో ఘనంగా హరీష్‌రావు జన్మదిన వేడుకలు



**మహబూబాబాద్, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ శాసన సభ పక్ష ఉప నాయకులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావు అభివృద్ధికి, అంకితభావానికి మారుపేరు అని, ఆయన స్ఫూర్తితోనే తాము కూడా ముందుకు సాగుతున్నామని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామని" బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మహబూబాబాద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి ఫరీద్ కొనియాడారు. సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలను మహబూబాబాద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి ఫరీద్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానుకోటలోని శ్రీ దివ్య కృప అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదానం నిర్వహించడంతో పాటు వారికి అవసరమైన నోట్‌బుక్స్, పండ్లను ఎండి ఫరీద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులు హరీష్‌రావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్ష లు తెలియ జేశారు. అనంతరం ఎండి ఫరీద్ మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న హరీష్‌రావు మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మకంటి వెంకట్ గౌడ్, దుగ్గి రాంగోపాల్, ఎస్‌కే జవీద్, మోతుకురి యువరాజ్, మహమ్మద్ గాయాజ్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు



## వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ డిఎస్పీగా వెంకటరమణ

**మట్టెవాడ, జూన్ 03 (పీపుల్స్ డైరీ):** సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ నూతన డి.ఎస్పీగా నియమించబడిన ఎం. వెంకటరమణ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందచేశారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ప్రజల్లో సైబర్ నేరాలపై మరింత అవగహన కల్పించాలని అన్నారు. గతంలో ఇక్కడ సైబర్ క్రైమ్ డి.ఎస్పీగా పని చేసిన కె. గిరికుమార్ మహబూబ్ గర్ సైబర్ క్రైమ్ డిఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెంకటరమణ నియమితులయ్యారు.




## తాత్కాలిక బోధకులు, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కేసముద్రం, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** మండలంలో పూర్వ ప్రాథమిక తరగతులు మంజూరైన అర్పనపల్లి, బేరువాడ మరియు రంగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రతి పాఠశాలకు ఒక పూర్వ ప్రాథమిక బోధకులు మరియు ప్రతి పాఠశాలకు ఒక ఆయా పోస్టుల చొప్పున మొత్తం 6 తాత్కాలిక పోస్టులు మంజూరు చేస్తూ మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.సత్యనారాయణ మూర్తి ఆదేశాలు జారీ చేసినట్లు కేసముద్రం మండల విద్యాశాఖాధికారి కాలేరు యాదగిరి తెలిపారు. ప్రీ ప్రైమరీ తరగతుల బోధకుల అర్హతలు ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన విద్యతో పాటు బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఆయా పోస్టుకు కనీస విద్యార్హత ఏడవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి. స్థానిక నివాసులకు ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వబడును. గౌరవ వేతనం బోధకులకు నెలకు 8 వేల రూపాయలు మరియు ఆయాకు నెలకు 6 వేల రూపాయల చొప్పున చెల్లించబడుతుంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 6వ తేదీలోగా కేసముద్రం మండల విద్యావనరుల కేంద్రంలో సమర్పించగలరని తెలిపారు.

## 5న వరంగల్‌లో భారీ వాకథాన్

**మట్టెవాడ, జూన్ 03 (పీపుల్స్ డైరీ):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ వారి ఆధ్వర్యంలో ఓ సిటీ, రాంకీ వాకర్ సంఘాలు, హరిత సంస్థ యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ (యూఎఫ్ఈపీ) భాగస్వాములుగా 5వ తేదీ శుక్రవారం ఉదయం 6.30 గంటలకు భారీ వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యూఎఫ్ఈపీ మీడియా కన్వీనర్ మండల పరశురాములు తెలిపారు. ఈ వాకథాన్ కార్యక్రమం వరంగల్ నగరంలోని ఓ సిటీ ఇండోర్ స్టేడియం నుండి ప్రారంభమై కాశిబుగ్గ జంక్షన్ వరకు కొనసాగుతుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, మొక్కలు నాటుట ప్రాధాన్యత, ప్రజల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ముఖ్య అతిథిగా, అధ్యక్షులుగా పిసిబి ఈఈ శ్రీమతి సునీత, ఇతర పర్యావరణవేత్తలు, వివిధ హరిత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, వరంగల్ నగరంలోని అన్ని పర్యావరణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, యువత, వాకర్స్ అసోసియేషన్లు, మహిళా సంఘాలు, పర్యావరణ ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరశురాములు కోరారు.

పీపుల్స్ డైరీ
కరీంనగర్
గురువారం, 4 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 93


## వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

**ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా**

**ప్రత్యామ్నాయ పంటల సాగు, నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి**

**పంట అవశేషాలకు నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవు**

**ఖరీఫ్ సాగు ప్రణాళికపై మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఖమ్మం, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే





సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశం లోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్- అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశం ఇప్పటికీ వంటనూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల కోసం విదేశాలపై ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం వల్ల రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు. పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మీడియా ప్రతినిధులు, తదితరులున్నారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలు



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం), జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను ఇల్లందు మండలం సింగరేణి జీఎం ఆఫీస్ దగ్గర శ్రీ సువర్చల సమేత అంజన్నయ్య ఆలయంలో హరీష్ రావు పేరిట ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఇల్లందు పట్టణం జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర బిఆర్ఎస్ శ్రేణులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ, స్వరాష్ట్ర నిర్మాణంలోనూ ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్ రంగనాథ్, సూతపాక సత్యనారాయణ, శీలం రమేష్, అబ్దుల్ నబి, ఎస్ కే ఘాజి, దేరంగుల పోశం, రాచపల్లి శ్రీను, మూలగుండ్ల ఉపేందర్, తాండ్ర నాగరాజు, తాళ్లపల్లి విజయ్, సదరం మహేష్ చిన్నారి, కూడా రమేష్, సారంగపాణి, మాచర్ల విజయ్, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డు తక్షణమే నిర్వహించాలి



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** మెడికల్ బోర్డు తక్షణమే నిర్వహించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి. కొత్త గనులను సాధిస్తూ సంక్షేమ చర్యలు అమలు చేయాలని ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య కి విజ్ఞప్తి పత్రం అందజేశారు. గత అసెంబ్లీ. సింగరేణి గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నారని, సింగరేణి కార్మికులకు ప్రతి నెలలో రెండు మెడికల్ బోర్డు నిర్వహించి, అధిక సంఖ్యలో కారణ్య ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆచరణలు గడిచిన 15 నెలలుగా ఒక్క మెడికల్ బోర్డు నిర్వహించలేదు. వేలాదిమంది కార్మికులు తమ వారసులకు ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు దిండిగాల రాజేందర్, కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. రంగనాథ్, అబ్దుల్ నబి, సూర్ణపాక సత్యనారాయణ , ఘాజీ, ఉపేందర్ రావు లలిత్ కుమార్ పాసి, పర్కపల్లి రవి గౌడ్. రాచపల్లి శ్రీనివాస్. ఫైనాన్స్ ఇమ్రాన్, గోల్డ్ ఇమ్రాన్, హరికృష్ణ,కార్మికులు మహమ్మద్ జాఫర్ హుస్సేన్ ఉపాధ్యక్షులు ఇల్లందు ఏరియా భద్రాద్రి కొత్తగూడెం తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



**ఏన్కూరు, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** గ్రామీణ యువత క్రీడాస్ఫూర్తితో ఎదగాలని ఖమ్మానికి చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు అన్నారు. ఏన్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరుణ్ మోమోరియల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తూ తమ ప్రాంతాలకు మంచి పేరు తేవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను వైద్యులు నాగేశ్వరరావుతోపాటు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తనయుడు విఘ్నేశ్, ఏఎంసీ ఛైర్మన్లు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, గుగులోతు లచ్చిరాంనాయక్‌లు పరిచయమయ్యారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సుందరం, కాంగ్రెస్ నాయకులు మేడ ధర్మారావు, భూక్యా లాలూనాయక్, మొగిలి నాగరాజు, గోళ్ల చిన్నస్వామి, నిమ్మల నాగేశ్వరరావు, నారాయణదాసు నరసింహారావు, పంతగానినరేశ్, నాని, నరీన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

**పినపాక. జూన్ 03(పీపుల్స్ డైరీ) :** పినపాక మండలంలోని సీతారాంపురం, గ్రామ పంచాయతీలో రూ.12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో అంగన్ వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు మెరుగైన విద్య, పోషకాహారం, ప్రాథమిక సదుపాయాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎం ఆర్ ఓ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ కుమార్, పిఆర్ ఏఈ వంశీ, ఆర్ఐలు శ్యాంసుందర్, రమేష్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు,



మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రైవేట్ ఎలక్ట్రిషియన్, వైర్‌మెన్ నూతన కమిటీ ఎన్నిక

**ఖమ్మం, జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం నగర ప్రైవేట్ ఎలక్ట్రిషియన్, వైర్ మేన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు స్థానిక యూనియన్ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జడల అంజయ్య, విశిష్ట అతిథులుగా డిసిసి ఖమ్మం టౌన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై.హనుమంతరావు, ఓబిసి పట్టణ అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్, ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ జిల్లా అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు, వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రిషియన్లు అందరూ కలసిమెలసి ఐక్యంగా ఉండాలని, అందరూ ఒకే రేటుతో పని



చేయాలని ముఖ్యంగా ప్రతి ఎలక్ట్రిషియన్ లేబర్ కార్డు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎస్కే. హాషిం షరీఫ్, బస రాము, కొప్పుల రామారావు, ఎం.శ్రీను, కరని వీరస్వామి, బి.రామారావు, కే. శాంసన్, పి.విజయ్ కుమార్, హనుమంతు, షారుఖ్ అల్ఫాత్ తదితరులున్నారు.

## బొజ్జన్నపేట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా ముఖేష్



**నర్సింహులపేట, జూన్ 3 (పీపుల్స్ డైరీ):** మండలంలోని బొజ్జన్నపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నాగవెల్లి ముఖేష్‌ను పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు ముఖేష్ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు భానోత్ దస్రు నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి మహబూబ్ ఖాన్, సమన్వయ కమిటీ అధ్యక్షుడు అల్వాల శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు సతీష్, వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ కాసాయాకయ్య, గ్రామ సర్పంచ్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, మార్క రమేష్, కళ్యాణ్, శ్రీను, రాజు, మెరుగు నరేష్ గౌడ్, పాపా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 20వేల మోటర్ వితరణ

**ఏన్కూరు, జూన్ 3 (పీపుల్స్‌డైరీ) :** ఏన్కూరులో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనుల్లో భాగంగా శెట్టిపల్లి నారాయణ, బసవమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం రూ.20వేల మోటర్, సామాగ్రి అందజేశారు. హిందూ శ్మశానవాటిక దశల వారీగా అభివృద్ధి చేస్తున్న డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు అక్కడ బోరులో మోటర్, విద్యుత్ సామాగ్రి పనిచేయడం లేదని గ్రామస్థుల ద్వారా తెలుసుకున్నారు. మార్కెట్‌యార్డు సమీపం నుంచి విద్యుత్ సదుపాయం కల్పించి మోటర్ బిగించే ఏర్పాటు చేశారు. ఏళ్లుగా శ్మశానవాటికలో ఉన్న సమస్యను పరిష్కరించిన వైద్యులు నాగేశ్వరరావుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. స్వయంగా ఆయనే వచ్చి మోటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కొండపల్లి నాగేశ్వరరావు, కడియాల కోటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ గుగులోతు లచ్చిరాంనాయక్, గ్రామస్థులు ముదిగొండ పుల్లయ్య, కూరాకుల కోటేశ్వరరావు, అత్తులూరి కోటాచారి, నిమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**చిట్యాల,జూన్ 3 (పీపుల్స్ డైరీ) :** కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఒక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామానికి చెందిన బోంత రాములు కుమార్తె గొల్లెన లక్ష్మి (25)కి 2016లో రేగొండ మండలం రేపాక గ్రామానికి చెందిన గొల్లెన హరితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కుమారుడు కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం భర్తతో గొడవ పడిన లక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై అక్కడి నుండి చిట్యాల వాళ్ళ మేన మామ అయిన ఓర్సు రాజయ్య ఇంటికి వచ్చి చిట్యాల గ్రామానికి చెందిన అల్లం తిరుపతి ఎడ్ల కొట్టం వద్ద పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తరలించే లోపే ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి బోంత రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు.



## 13 ఇంకుడుగుంతలు మంజూరు

**కరకగూడెం, జూన్ 3(పీపుల్స్ డైరీ) :** కరకగూడెం మండలానికి 13 డ్రైవ్ అండ్ సోప్ పిట్స్ (ఇంకుడు గుంతలు) మంజూరయ్యని పంచాయతీ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. భూగర్భ జలాలు పెంపుదల లక్ష్యంగా ప్రభుత్వం ఈ గుంతలను మంజూరు చేసిందని వెల్లడించా రు. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ 90 వేల చొప్పున నిధులు కేటాయించనట్లు తెలిపారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి నీటి కొరత తీర్చడమే ఈ పథకం ఉద్దేశ్యమని వివరించారు. పనులు సైతం ప్రారంభించినట్లు తెలిపారు



## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం



**చెన్నూరు, జూన్ 3(పీపుల్స్ డైరీ) :** నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాయిపేట స్థానిక గ్రామ పంచాయతీలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్, పెద్దింటి సంతోష్ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు పంచాయతీ సెక్రెటరీ స్వరూప హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇళ్ల వద్ద రిబ్బన్ కట్ చేసి,సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి గృహప్రవేశాలు చేయించారు. పేద ప్రజల సొంతింటి కల సాకారం కావడం సంతోషకరమని సర్పంచ్ పేర్కొనగా, ఇళ్ల నిర్మాణ ప్రక్రియను పంచాయతీ సెక్రెటరీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com